క్లుప్తంగా

దేవస్థాన ఖాళీస్థలాలు వేలంపాట

బొల్లాపల్లి: మండలంలోని వెల్లటూరు గ్రామంలో వేంచేసియున్న రుక్మిణీ సమేత వేణుగోపాల స్వామి దేవస్థానానికి సంబంధించి దక్షిణం వైపు భాగంలో ఉన్న ఖాళీస్థలాలు, షాపులకు వేలం పాట నిర్వహించనున్నట్లు ఈవో బి.శ్రీనివాస రావు సోమవారం తెలిపారు. బుధవారం) ఉదయం 10 గంటలకు గ్రామంలోని దేవస్థానం లో మూడేళ్లపాటు పాట ఉంటుందన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

వినుకొండ(నూజెండ్ల) : వినుకొండ నియోజకవర్గ యోగివేమారెడ్డి సేవా సమితి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నూతన కమిటీ నియామకం సోమవారం జరిగింది. ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎడ్యుకేషనల్ ట్రస్ట్ గౌరవాధ్యక్షులుగా డాక్టర్ గోపు ఇన్నారెడ్డి, కన్వీనర్‌గా కర్నాటి చెన్నకేశవ రెడ్డి, కోశాధికారిగా బిక్కం నారాయణరెడ్డిలను ఎన్నుకున్నారు. కో కన్వీనర్లుగా సోము సుందరరామిరెడ్డి, ఇసిరెడ్డి రామిరెడ్డి, జానకమ్మతో పాటు ట్రస్ట్ సభ్యులను ఎన్నుకున్నారు.

జలజీవన్ మిషన్ పనులు

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు, వెలమవారిపాలెం గ్రామాల్లో జలజీవన్ మిషన్ పథకంలో రూ. ఒక కోటి 80 లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులు సోమవారం ప్రారంభమైనట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మూఢవత్ ఆకాష్ సోమవారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏఈ మాట్లాడుతూ మంచినీటి చెరువు నుంచి అద్దంకి బ్రాంచ్ కెనాల్ మార్గం వరకు 1850 మీటర్ల మొర సిమెంటు పైపు లైను నిర్మాణ పనులతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలో హెచ్‌పీఈ పైపులైను నిర్మాణ పనులు 20 రోజుల వ్యవధిలో పూర్తి చేస్తామన్నారు. అలాగే మండలంలోని చినకంచర్ల గ్రామంలో జలజీవన్ మిషన్ పథకం నిధులు రూ. 50 లక్షల వ్యయంతో చేపట్టిన పనులు తుది దశకు చేరాయన్నారు.

వ్యాధులపై అవగాహన ఉండాలి

నరసరావుపేట ఈస్ట్: ప్రాణాంతక వ్యాధులపై విద్యార్థులు సరైన అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవి తెలిపారు. జిల్లా వైద్యశాఖ ఎయిడ్స్ నియంత్రణ, నిర్మూలనా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో 9, 10 తరగతుల విద్యార్థులకు దీర్ఘకాలిక వ్యాధులైన హెచ్ఐవి, టిబిపై వ్రాత పరీక్ష నిర్వహించారు. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు రాత పరీక్షకు హాజరయ్యారు. విజేతలకు బహుమతులు అందచేసిన డాక్టర్ రవి మాట్లాడుతూ, యూత్ ఫెస్ట్ 2023-24లో భాగంగా విద్యార్థులకు పోటీలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రాత పరీక్షలో బి.లక్ష్మీ నాగశ్రావ్య, షేక్.అంజుమ్‌గౌసియా మున్సిపల్ బాలికోన్నత పాఠశాల (నరసరావుపేట) ప్రథమ, షేక్.సాదియాఅలియా, సయ్యద్ మీరాజాస్మిన్ శ్రీతిలక్ మున్సిపల్ హైస్కూల్ (నరసరావుపేట), ఎన్.లీలావినయ్, బి.కార్తికేయరామ్ ఏపి మోడల్ స్కూల్ (పల్లెగుంత) సమాన మార్కులతో ద్వితీయ స్థానాలలో నిలిచాయి. ఉప్పలపాడు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు బి.అశ్విని, టి.వెంకటకళ్యాణ్‌లకు ప్రోత్సాహక బహుమతి లభించింది.

గ్రామాలకు మెరుగైన విద్యుత్ సరఫరా

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- లింగంగుంట్లలో త్రీఫేజ్ విద్యుత్ సరఫరా పనులు ప్రారంభం

నరసరావుపేట రూరల్: గ్రామాల్లో మెరుగైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి తెలిపారు. మండలంలోని లింగంగుంట్లలో రూ.87 లక్షలతో ఏర్పాటు చేయనున్న త్రీఫేజ్ విద్యుత్ సరఫరా పనులకు సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో చేపడుతున్న పనుల ద్వారా ఎలాంటి అవాంతరాలు లేకుండా విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు. దాదాపు 300



లింగంగుంట్లలో త్రీఫేజ్ విద్యుత్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

విద్యుత్ స్తంబాలు, 30 ట్రాన్స్‌ఫార్మర్స్‌ను నూతనంగా ఏర్పాటు చేస్తారని తెలిపారు. దీని ద్వారా గ్రామానికి 24 గంటల పాటు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. ఇప్పటికే ఇక్కుర్రు, ములకలూరు, వి.రెడ్డిపాలెంలో పనులు పూర్తిచేసి త్రీఫేజ్ విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని వివరించారు. విద్యుత్ శాఖ ఎస్ఈ వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ త్రీఫేస్ విద్యుత్ అందుబాటులోకి రావడం వలన వినియోగదారులకు ఎలాంటి అసౌకర్యాలు ఉండవని తెలిపారు. అంతేకాకుండా పారిశ్రామికంగా అభివృద్ధికి విద్యుత్ సరఫరా దోహద పడుతుందన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ రూరల్ డీఈ వెంకటేశ్వరరెడ్డి, టౌన్ డీఈ ఏడుకొండలు, జెడ్పీటీసీ పదముత్తం చిట్టిబాబు, ఎంపీపీ మూరబోయిన శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ యాంపాటి వెంకటప్పారెడ్డి, మాజీ సర్పంచ్ పొన్నపాటి ఈశ్వరరెడ్డి, కామిరెడ్డి నర్సిరెడ్డి, కామిరెడ్డి నాగిరెడ్డి, పొన్నపాటి విజయకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



చిలకలూరిపేట: రైతులు దళారులను నమ్మి మోసపోకుండా సీసీఐ కొనుగోలు కేంద్రం ద్వారా తాము పండించిన పత్తిని విక్రయించాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్ చెప్పారు. వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వాడుకలో ఉన్న వారి బ్యాంకు ఖాతాలను ఆధార్ నంబర్లతో అనుసంధానం చేసుకోవాలని సూచించారు. అటువంటి ఖాతాల ద్వారానే రైతులకు చెల్లింపులు జరుగుతాయని చెప్పారు. ఇప్పటికే ఈ-పంట నందు నమోదు చేసుకున్న రైతులు తమ దగ్గరలోని రైతు భరోసా కేంద్రాలకు ఆధార్‌కార్డు, పట్టాదారు పాసు పుస్తకం నకలు తీసుకువెళ్లి తమ పేరు నమోదు చేసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రానికి పత్తి తీసుకువచ్చే సమయంలో పత్తిపై నీళ్లు చల్లరాదని, 12 శాతంపై తేమకలిగిన పత్తిని, నాణ్యత లేని రంగు మారిన, వర్షానికి తడిసిన పత్తిని సీసీఐ కొనుగోలు చేయదన్న విషయం రైతులు గుర్తించాలని చెప్పారు. విడదల గోపీనాథ్, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, నాదెండ్ల జెడ్పీటీసీ సభ్యుడు కాట్రగడ్డ మస్తాన్‌రావు, వైఎస్సార్ సీపీ నాయకులు తోట బ్రహ్మస్వాములు, సింగారెడ్డి కోటిరెడ్డి, మౌలాలి, షేక్ బాజి, మార్కెట్‌యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి యూ యోగేశ్వరరావు, సీసీఐ బయ్యర్లు కె నాగ మహేష్, బి రమేష్ పాల్గొన్నారు.

మరుగుదొడ్లను నిర్మించుకోవాలి

వినుకొండ(నూజెండ్ల): స్వచ్ఛభారత్ మిషన్ ఫేజ్-2 కింద నూజెండ్ల మండలంలోని లైట్ హౌస్ గ్రామాలైన జంగాలపల్లి, తలార్లపల్లి గ్రామాల్లో మరుగుదొడ్లు మంజూరైన లబ్ధిదారుల ఇళ్లకు అధికారులు వెళ్లి వెంటనే నిర్మాణాలను చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్క లబ్ధిదారుడు ఈ నెల 19వ తేదీ లోపు మరుగుదొడ్లను నిర్మించుకోవాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నీరు పారిశుధ్య కమిటీ హెచ్ఆర్డీ రమేష్, ఐటీసీ సెర్ప్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, స్వచ్ఛభారత్ మండల సమన్వయకర్త కంచర్ల సుబ్బరామయ్య, సీఓ ప్రదీప్, ఏసోబు, ఫీల్డ్ అసిస్టెంట్, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలి

నాదెండ్ల: క్లాసుల్లో విన్న పాఠాలు ఇంటి వద్ద రివిజన్ చేసుకుంటే చక్కగా గుర్తుండి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించవచ్చని ఎంఈవో ఐ.ఆంజనేయులు చెప్పారు. సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా క్లాసు రూములోకి వెళ్ళి విద్యార్థులతో మాట్లాడారు. ఈ ఏడాది అక్టోబర్ మాసం వరకు పూర్తయిన సిలబస్ వివరాలను తెలుసుకున్నారు. సిలబస్‌పై విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు.

ఎస్సీ, ఎస్టీలకు సాగు భూములివ్వాలంటూ వినతి

యడ్లపాడు: నిరుపేదలైన ఎస్సీ, ఎస్టీల జీవనోభృతికై ప్రభుత్వం సాగుభూములిచ్చి ఆదుకోవాలని ఏపీ గిరిజన సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు బి.శ్రీను నాయక్ కోరారు. సోమవారం వేదిక సభ్యులతో కలిసి స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. మండలం పరిధిలో మిగులు భూములను అధికారులు గుర్తించి నిరుపేదలైన ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రెండు ఎకరాల చొప్పున సాగు చేసుకునేందుకు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సదరు విషయాలను గురించి రాసిన వినతిని తహసీల్దార్ వైవీబీ కుటుంబరావుకు అందజేశారు.

జగనన్న పాదయాత్ర వల్లే సువర్ణపాలన

చిలకలూరిపేట: రాష్ట్రంలో ప్రస్తుతం కొనసాగుతున్న సువర్ణ పరిపాలనకు జగనన్న సుదీర్ఘంగా కొనసాగించిన పాదయాత్రే కారణమని వైఎస్సార్ సీపీ నాయకులు కొనియాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ప్రజాసంకల్ప పాదయాత్రకు ఆరేళ్లు పూర్తి అయిన సందర్భంగా పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. తొలుత మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో విడదల గోపీనాథ్, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, ఏపీ ఎస్‌ఐడీసీ డైరెక్టర్ మల్లెల రాజేష్‌నాయుడు, రాష్ట్ర ముస్లిం సంచార జాతుల కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ దరియావలి, ఎంపీపీ దేవినేని శంకరరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు పఠాన్ తలహాఖాన్ పాల్గొన్నారు.

అదుపు తప్పింది.. డివైడర్ ఎక్కింది!



అధిక లోడ్‌తో వస్తున్న లారీ అదుపు తప్పి డివైడర్ ఎక్కిన సంఘటన సోమవారం తెల్లవారుజామున పట్టణంలో చోటుచేసుకుంది. వివరాల్లో కెళ్లితే.. మల్లమ్మ సెంటర్ ఓవర్ బ్రిడ్జి మీదుగా ఆర్టీసీ బస్టాండ్ వైపుకు అధిక లోడ్‌తో లారీ వెళ్తుంది. బిలాల్ హోటల్ దిగువ భాగం వద్దకు వచ్చేసరికి లారీ అదుపు తప్పి డివైడర్ పైకి ఎక్కింది. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం ఆసమయంలో ఎవ్వరూ లేకపోవటంతో పెను ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న ట్రాఫిక్, టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్రేన్ సహాయంతో లారీను అక్కడి నుంచి తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

–నరసరావుపేట టౌన్

రొంపిచర్లలో అగ్ని ప్రమాదం

రొంపిచర్ల: మండల కేంద్రంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో మూడు పూరిళ్లు దగ్ధమై రూ.5 లక్షల రూపాయల ఆస్తినష్టం సంభవించింది. ఈ ప్రమాదంలో తంబా వెంకటేశ్వర్లు, సుబ్బ రత్నం, శ్రీనివాసరావుకు గృహాలు దగ్ధమయ్యాయి. రాత్రి వేళ అందరూ నిద్రిస్తుండగా పెద్ద మంటలు ఎగసిపడ్డాయి. ఈ మంటల వేడికి మెలుకు వచ్చిన వెంకటేశ్వర్లు మనవరాలు గృహం నుండి బయటకు వచ్చి పెద్దగా కేకలు వేసింది. గృహాల్లో నిద్రిస్తున్న వారంతా ఇంట్లోనుంచి పరుగులు తీయడంతో ప్రాణాలతో బయట పడ్డారు. ఈ ప్రమాదంలో రూ.1.50 లక్షల రూపాయల నగదు, 3 సవర్ల బంగారం, గృహోపకరణాలు, దుస్తులు, పిల్లల పుస్తకాలు, సామన్లు, ఆధార్ రేషన్ కార్డులతో సహా అన్ని అగ్నికి ఆహుతి అయ్యాయి. విషయం తెలుసుకున్న వీఆర్వో పడాల సుబ్బారెడ్డి, సంఘటనా స్థలాన్ని చేరుకొని బియ్యం, నగదును అందజేశారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

ఎమ్మెల్యే పరామర్శ

అగ్ని ప్రమాదంలో గృహాలు కోల్పోయిన కుటుంబాలను అన్ని విధాల ఆదుకుంటామని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం ఎమ్మెల్యే



ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎమ్మెల్యే

అగ్ని ప్రమాదం జరిగిన తీరును బాధితులను అడిగి తెలుసుకున్నారు. వారికి ధైర్యం చెప్పారు. అగ్ని ప్రమాదంలో గృహాలు కాలిపోవడం దురదృష్టకరమన్నారు. గృహనిర్మాణం పథకం కింద ఇల్లు మంజూరు చేయిస్తామని బాధితులకు హామీ ఇచ్చారు. ప్రభుత్వ పరంగా ఒక్కో కుటుంబానికి రూ.5 వేల రూపాయల చొప్పున నగదు, బియ్యం అందజేశారు. మొత్తం రూ. 25 వేల రూపాయలను అందజేశారు. బాధిత కుటుంబాలకు బియ్యం, ఆర్యవైశ్యులు అందజేసిన దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జి.అంకారావు, ఆర్ఐ సుబ్బారావు, వీఆర్వో పడాల సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు పొగాకు ఉత్పత్తుల అమ్మకం నిషేధం

నరసరావుపేట: చిన్న పిల్లలకు, స్కూల్ విద్యార్థులకు పొగాకు ఉత్పత్తుల అమ్మటం నిషేధమని స్టేట్ పొగాకు నియంత్రణ కార్యాలయ న్యాయ సలహాదారు పుట్టి శివ పేర్కొన్నారు. సోమవారం జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా నరసరావుపేట బస్టాండ్ ఎదురుగా ఉన్న టీ దుకాణాలు, కూల్ డ్రింక్స్ దుకాణాలలో లా ఎన్‌ఫోర్స్‌మెంట్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ముఖ్యఅతిధిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ షాపులలో అక్రమంగా సిగరేట్స్, గుట్కాలు, ఇతర పొగాకు



అవగాహన కల్పిస్తున్న శివ

ఉత్పత్తుల అమ్మకాలు నిర్వహించరాదన్నారు. కార్యక్రమంలో జిల్లా డీసీఎం, సోషల్‌వర్కర్ నందిగం సురేష్, కంభంపాలెం మున్సిపల్ హైస్కూలు ప్రధానోపాధ్యాయులు నాగయ్య పాల్గొన్నారు.

యడ్లపాడులో తెనాలి ఫొటోగ్రాఫర్ దుర్మరణం

యడ్లపాడు: బైక్‌పై ప్రయాణిస్తూ సినీఫక్కీలో 20 అడుగుల ఎత్తులో ఉన్న వంతెనపై నుంచి కిందపడి తెనాలికి చెందిన ఫొటోగ్రాఫర్ మృతి చెందిన సంఘటన మండలంలో జరిగింది. వివరాలలోకి వెళితే.. తెనాలి పట్టణం రామలింగేశ్వరనగర్‌కు చెందిన ఫొటోగ్రాఫర్ కొడవటి ప్రభుకుమార్ (31) బైక్‌పై సోమవారం సాయంత్రం చిలకలూరిపేట నుంచి గుంటూరు వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో యడ్లపాడు వద్ద ప్రారంభంలో ఉన్న అండర్‌పాస్ వంతెనపై ఎక్కి మలుపు తిప్పే క్రమంలో వాహనం అదుపుతప్పి ఎడమవైపు ఉన్న సైడ్‌వాల్‌కు ఢీకొంది. దీంతో బైక్‌పై ఉన్న ప్రభుకుమార్ ఒక్కసారిగా గాల్లోకి ఎగిరి వంతెన కింద ఉన్న సర్వీసు మార్గంలోని స్పీడ్‌బ్రేకర్లపై వచ్చి పడ్డాడు. 108 వాహన సిబ్బంది చేరుకుని యువకుడిని పరీక్షించి తలకు బలంగా తగలడంతో అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఊహించని ఈ సంఘటనకు ఈ బ్రేకర్లకు సమీపంలోని బైక్ మెకానిక్, ఫాస్ట్‌ఫుడ్ దుకాణాలతో పాటు సమీపంగా ఉన్న జనం చూసి షాకయ్యారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని అంతా ఊపిరి పీల్చుకున్నారు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న యడ్లపాడు ఎస్ఐ పి సురేష్ పరిశీలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

నాదెండ్ల: రోడ్డు ప్రమాదంలో పూర్తిగా ఆరోగ్యం దెబ్బతిన్న వ్యక్తి ఎలుకల మందు తిని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గణపవరం గ్రామంలో చోటు చేసుకుంది. నాదెండ్ల ఎస్సై జె బలరామ్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు నరసరావుపేటకు చెందిన షేక్ మస్తాన్‌వలి (35) పదమూడేళ్ళ క్రిందట గణపవరం గ్రామానికి చెందిన షేక్ మీరాబీతో వివాహమైంది. ఏడేళ్ళ నుంచి గణపవరంలోనే నివాసం ఉంటు ఇనుప బీరువాలు, తాళాలు మరమ్మతులు చేస్తున్నాడు. సుమారు నెల క్రితం రోడ్డు ప్రమాదంలో తలకు బలమైన గాయాలై అవయవాలు పనిచేక ఇంటికే పరిమితమయ్యాడు. మద్యానికి బానిసైన మస్తాన్‌వలి గత నెల 29న రాత్రి 7 గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఎలుకల మందు తిన్నాడు. బంధువులు గమనించి నరసరావుపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు రిఫర్ చేయగా సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి ఇరువురు కుమార్తెలు ఉన్నారు. భార్య మీరాబీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

దేవాలయంలో కానుకలు చోరీ

నాదెండ్ల: గణపవరం-కావూరు డొంక రోడ్డులో కొలువైయున్న వీరాంజనేయ స్వామి దేవస్థానంలో చోరీ జరిగింది. ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో ఆలయ పూజారి పరిమి లక్ష్మీనారాయణ ఆలయానికి తాళాలు వేసి వెళ్లాడు. సోమవారం ఉదయం ఆలయం తెరిచేందుకు వచ్చి చూడగా దేవస్థానం ఆవరణలో ఉన్న హుండీ మాయమైనట్లు గుర్తించాడు. కమిటీ సభ్యులు, పోలీసు లకు సమాచారమిచ్చారు. నాదెండ్ల పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కమిటీ సభ్యులు పరిసరాలను పరిశీలించగా దేవాలయం సమీపంలోని పంట పొలాల్లో పగలగొట్టిన ఖాళీ హుండీ పడి ఉండటం గుర్తించారు.

9న మండల పరిషత్ సమావేశం

యడ్లపాడు: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 9న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వై హనుమారెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీపీ పిడతల ఝాన్సీ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందన్నారు.

ఉపాధి హామీ గ్రామసభలు

వినుకొండ (నూజెండ్ల): మండలంలోని కంభంపాడు, గురప్పనాయునిపాలెం గ్రామాల్లో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పనుల గుర్తింపు ఫైనల్ గ్రామసభలు జరిగాయి. కంభంపాడు గ్రామసభలో పాల్గొన్న ఎంపీడీవో వీరభద్రాచారి మాట్లాడుతూ పనులు పూర్తిస్థాయిలో లేబర్ బడ్జెట్ ప్రకారం గుర్తించి తీర్మానం చేసి అందజేయాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు నాగేంద్రబాబు, పవన్‌కుమార్ ఏపీవో కట్టా నాగేశ్వరరావు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.